# డాలరుకో గుప్పెడు రూకలు

– నిడదవోలు మాలతి

ఎన్నారయ్యొస్తున్నాడెన్నారయ్యొస్తున్నాడంటూ ఒకటే హడావుడి.
వూరంతా గుప్పుమంది. కార్చిచ్చులా కమ్ముకొచ్చింది ఇరుగుపొరుగుల
ఏడామడల దూరం. ఎన్నారయ్యొస్తున్నాడంట.
ఇరవైయేళ్ళనాడు దేశంవెల్లిన కుర్రకుంక ఎంతో ఎత్తు ఎదిగిపోయి ఇరుచేతులా సంపాదించేసి
ఘనకార్యాలు సాధించేసి ఈనాడు యూయస్సమ్మతో, కాఫీరంగు కూతురితో,
సీమటపాకాయలాటి కుమారుడితో.
చుట్టపుచూపుగా తల్లిదండ్రుల్నీ, తాతముత్తాతల్నీ, మేనమావల్నీ, బావమరుదుల్నీ,
గోళీకాయలాడుకున్న నేస్తాల్నీ, ఎరిగినవాళ్లనీ, ఎరగనివాళ్లనీ, పాత చుట్టరికాలు
తిరగదీయడానికీ, కొత్త స్నేహాలు కలుపుకోడానికీ, ఎన్నారయ్య వొస్తున్నాడంట!

చిన్నప్పుడెప్పుడో తిరణాల్లో తప్పిపోయిన బాలుడు తిరిగొచ్చినంత సంబరం.
గోడలకి రంగులేయించారు. గుమ్మాలకి తోరణాలు కట్టించారు. పడగ్గదిలో సరికొత్త
బాతురూం, నట్టింట టెలిఫోనూ, పరదాలూ, ఫ్రిజ్‌లో బ్రెడ్డూ, జామూ, బాటిల్డ్ వాటరూ...
ఎంత చేసినా ఏదో తక్కువైనట్టు రవంత అసంతృప్తి!
ఏంకావాలేంకావాలని ఎన్ని మార్లడిగినా, ఎన్ని విధాల చెప్పినా వారు చెప్పినది
వీరితలకెక్కదు. వీరు చెప్పినది వారికయోమయం, అగమ్యగోచరం.

మొత్తంమీద ఆరోజు రానే వచ్చింది. ఎన్నారయ్యగారు వేంచేశారు, మహోత్సాహంతో,
భార్యాబిడ్డలతో, ధగధగ మెరుస్తున్న శాంసనైట్ సూట్‌కేసులతో. పిల్లలు మొహాలు
వేలాడేసారు కాని యూయస్సమ్మ మాత్రం ఓపిగ్గా సుతారంగా పెదాల చిర్నవ్వు
పులుముకుని పరువు నిలబెట్టుకుంది.

ఇడ్లీలు బ్రెక్‌ఫాస్ట్.
పిల్లలు సాంబారు తినలేకపోయారు కాని కొబ్బరిపచ్చడితో ఎలాగో అయిందనిపించారు.

పెద్దావిడ నొచ్చుకుంది. బ్రెడ్డుంది తినమంది. పోనీ పళ్లు తినకూడదా అంది. మరేదయినా చెయ్యనా అని అడిగింది.
"ఫరవాలేదమ్మా. కారాలు తింటారు కానీ పొద్దున్నే స్పైసీఫుడ్స్ తినలేరు," అంటూ ఎన్నారయ్య సద్దిచెప్పాడు. "వాళ్లంతే, ఏంవీ తినరు. అక్కడయినా ఇంతే " అన్నాడు. భార్య అవునంటూ తలాడించింది, సందర్భానుసారం సంభాషణాంశం గ్రహించి.
కూతురు అమెరికాలో సూ, ఇండియాలో సుసీ.
"సుసి లేదు, మసి లేదు, నేను మాత్రం చక్కగా సుశీలమ్మా అని పిలుచుకుంటాను" అన్నారు బామ్మగారు.
"అయాం నో అమ్మా" అంది ఆమాత్రం తెలుగు తెలిసిన కూతురు.
"చెప్పాను కదా ఇదో నాటకం అని. సుశీలమ్మ నీ"రో"లనుకో "అని తండ్రి ఇంగ్లీషులో అనునయించాడు.

గత ఆరెల్లుగా వాళ్లకెన్నివిధాల చెప్పొచ్చో అన్ని రకాలుగానూ బోధించాడు. ఆఖరికి, "మనం వో చిన్న నాటకం ఆడుతున్నాం అనుకో " మన్నాడు. "మనం పాత్రధారులం. స్క్రిప్టు మీ సొంతం. ఇక్కడ మీరేంచేసినా, చెప్పినా, ఈనాలుగు రోజులే. ఆతరవాత వాళ్లదారి వాళ్లదీ, మనదారి మనదీను. మనం ఏం అనుకుంటున్నాంవో వాళ్లకి తెలీదు. వాళ్లేం అనుకుంటున్నారో మనకి అక్కర్లేదూ, లెక్కలేదూ కూడాను" అంటూ.
ఇంత లెక్చరూ బుగ్గయిపోయింది. పిల్లలు మొహాలెత్తలేదు. బుంగమూతి చెదర్లేదు.

బ్రెక్‌ఫాస్ట్ అయింతరవాత వూరు చూడ్డానికెళ్దాం అని పిల్లలు కొంచెం సరదా పడ్డారు. కాని గుమ్మం ముందు పోగయిన జనాల్ని చూసేసరికి నీరసం వచ్చింది.
"నేను చెప్పాను కదా. వీళ్లకి మనం కొత్త. వీళ్ళెప్పుడూ తెల్లవారిని చూసి ఉండరు మరి" అంటూ ఎన్నారయ్య వాళ్లని బలవంతాన ఈడ్చుకెళ్లాడు వీధులోకి. ముక్కుతూ మూలుగుతూ నాలుగు రోడ్లు తిరగొచ్చారు. తీరా రోడ్డెక్కింతరవాత నేను వీళ్ళకి వూరు చూపిస్తున్నానా? వీళ్ళని వూరికి చూపిస్తున్నానా అన్న అనుమానం రాకపోలేదాయనకి.

"మాస్కూలు చూపిద్దాం నాన్నా" అన్నాడు చంద్రుడు, ఎన్నారయ్య తమ్ముడి కొడుకు. సరేనని పదండంటే పదండంటూ వీధిన పడేసరికి పన్నెండయింది.
నాలుగ్గోడల మధ్య ఓ తాటాకుల తడక, రెండు క్లాసులున్నట్టు సూచిస్తూ. ఓ నల్లబల్ల అవసరాన్నిబట్టి గదులు మారుతూ.

సీమబాబుగా చెలువొందుతున్న సీమటపాకాయ. చుట్టూ చూసి, స్కూలేదీ అనడిగాడు.
"వేరార్ ది టాయ్స్?"
యూయస్సమ్మ అస్పష్టంగా చిన్న సౌంజ్ఞ చేసింది అటు చూడమన్నట్టు.
పిల్లలు చెట్టుమీద కోతికొమ్మచ్చి, చెట్టుకింద కబాడి ఆడుకుంటూ కనిపించారు.
నింటెండోలూ వర్చువల్ రియాలిటీ లతో పెరిగిన పిల్లలకి అర్థం కానిది
"What do these children do for fun?"

చంద్రుడికి ఆ ప్రశ్న అర్థం కాలేదు. ఏంటి నాన్నా అని తండ్రినడిగాడు. బియ్యే చదివిన బ్లాక్ డెవలప్మెంటు ఆఫీసరు తండ్రికి కూడా అర్థం కావడంలేదు ఈ అమెరికా పిల్లల ఆంగ్లభాష. ఏదోలే ఆళ్ల గొడవ అంటూ చప్పరించేసాడు.

మర్నాడు పట్నం ప్రయాణం వేసుకున్నారు. షాపింగ్! బజారనగానే ప్రాణం లేచొచ్చింది పిల్లలకీ పెద్దలకీ కూడా. కాని అక్కడా అయోమయమే! ఇండియాలో షాపులవాళ్లు అమెరినుజనాల్ని ఎంతగా మోసం చేస్తారో వినివిని తల వాచిపోయింది.

"ఈబొమ్మెంత?"
"750 రూపాయలు"
"అమ్మో. 330కి ఇస్తావా?"
"720 ఇయండి"
"340 ఇస్తానంతే"
"తమకి తెలీందెంవుందండీ. 700 ఇయండి. పండుగపూట"
"350. అంతే."
"మరి మేంవెలా బతకాల సార్. మీరే సెప్పండి"
"మరో కొట్లో చూద్దాం పదండి"
560 రూపాయలకి ఖరారయింది ఆఖరికి.

కనిపించిన ప్రతీది ఇదెంత అదెంత అంటూ కావల్సిందీ అక్కర్లేనిదీ ఒకటే గొడవ సీమబాబు. అతనికదో ఆటగా వుంది.
మంచిగంధంతో చేసిన ఏనుగు బొమ్మొకటి ఎంతో అందంగా కనిపించిందతనికి.
"ఎంత"ని అడిగాడు.
"రెండువేల రెండొందల"న్నాడు షాపువాడు.

అంటే ఎన్ని డాలర్లని అడిగాడు మళ్ళీ.
"ఎంతయితే నీకెందుకు. నేం కొంటున్నాను కదా. కావలిస్తే తీసుకో," అన్నాడు ఎన్నారయ్య.
"నేనెంత ఖర్చుపెడుతున్నానో నాకు తెలియఖ్కర్లేదా?," అంటూ మొరాయించేడు ఎలవెన్నుల కలవాటయిన కుర్రాడు.
"ప్రైవేటు స్కూలికి పంపిస్తున్నాను బోలెడు తగలేసి. చెప్పు ఎన్ని డాలర్లో?" అన్నాడు కొడుకు తెలివితేటలూ, తన భాగ్యమూ తెలివిడి జేస్తూ.
యూయస్సమ్మకి కొడుకు పరువు నిలబెట్టవలసిన అవుసరం తెల్లనవగా,
"నీ ఆర్గనైజరేదీ" అనడిగింది.
సీమబాబుకి తన తెలివితేటలు ప్రదర్శించుకునే అవకాశం వొచ్చింది. గొప్పగా జేబులోంచి ఆర్గనైజరు తీసి "హౌ మెనీ రుపీస్ ఫరె డాలర్" అనడిగాడు.
"46"
సీంబాబు "కీ"లన్నీ నొక్కి లెక్క తేల్చేలోపల "47.8" అన్నాడు చంద్రుడు చటుక్కున.
సీంబాబు డిసప్పాయింట్మెంటు కప్పిపుచ్చడానికి వాణ్ణి మరోపక్కకి లాక్కెళ్ళింది యూయస్సమ్మ.
పిల్లలు చెయ్యేసిన ప్రతి వస్తువూ వెయ్యా, రెండు వేలూను. చంద్రుడు అమ్మో అమ్మో అంటుంటే, సీమట.కా. కూడా అమ్మో అమ్మో అంటు వంతపాడాడు. తనకొచ్చిన తొలి తెలుగు పదం!
సగానికి సగం తగ్గించి బేరాలాడసాగారు. వెయ్యిరూపాయల వస్తువు ఆరు వందలకి ఖరారు చేసుకు, తమరు మోసపోలేదని పరమానంద పడిపోయారు.
ఓకొట్లో నాలుగు చొక్కాలు తీసుకు డబ్బిస్తుంటే, కొట్టువాడు ఓ దుప్పటి పడేశాడు సంచీలో కొసరుగా. అందరూ ఆనందపడిపోయారు కాని సూసన్‌కది మహా అవమానంగా తోచింది.
అతను తమ అమాయకత్వానికి నవ్వుకుంటున్నాడా, జాలి పడుతున్నాడా?.

ఆబేరాలకి చిరాకు పడింది పదమూడేళ్ళ సూ అనబడే సూసన్ మాత్రమే. ఆపిల్ల దృష్టిలో 20 డాలర్ల వస్తువు పన్నెండు డాలర్లకి కొన్నట్టు లెక్క! ఎందుకింత ఆరాటం? రైల్వేస్టేషన్‌లో కూలీలతో 40 రూపాయలకి, 30 రూపాయలకీ బేరం ఆడుతున్నప్పుడు కూడా ఆ పిల్లకి మహా అన్యాయంగా తోచింది. పట్టుమని ఓ డాలరు కూడా కాదు. ఎందుకంత బాధ? వాళ్లనోటికాడ కూడు తీసేస్తున్నట్టు నొచ్చుకుందా అమ్మాయి.

మొత్తంమీద ఇండియా ట్రిప్పయిందనిపించుకుని, ఆవురావురంటూ తమ ఇల్లు చేరి హమ్మయ్య అనుకున్నంతసేపు పట్టలేదు. గుండెలు పగిలే దుర్వార్త మోసుకొచ్చారు పొరిగింటివారు!

ప్రయాణానికి ముందు సీమబాబు ముద్దుగా పెంచుకుంటున్న కుక్కపిల్ల హంటర్‌ని పొరుగువారికి ఒప్పజెప్పారు రెండువారాల పాటు చూసుకోమని. పొరుగింటి మేరీయాన్ సూసన్ ఒకే వయసు వాళ్లు. మేరీయాన్ హంటర్‌ని ప్రాణప్రదంగా చూసుకుంటానని మాటిచ్చింది.

మాట నిలబెట్టుకుంది కూడా – ఒక విధంగా ఆలోచించి చూస్తే.

ఎన్నారయ్య కుటుంబం తిరిగొచ్చే ముందురోజు, మేరీయాన్ హంటర్‌ని వాక్‌కి తీసుకెళ్లింది. రోడ్డు దాటుతూంటే, నలుగురు కుర్రాళ్లు స్పోర్ట్స్‌కారేసుకుని, తప్పతాగి, ఆదమరిచి, పట్టుతప్పి తమదార్న పోతున్న ఈ రెండుజీవాలమీదకీ పెట్టేశారు కార్ని. ఘోరం జరిగిపోయింది క్షణాలమీద. రెండు కుటుంబాలకీ ఒక్కలాటి బాధే! ఏం చేసినా తీరని క్షోభ.

కూతురిగురించి వాళ్లూ కుక్కపిల్ల గురించి వీళ్లూ వాపోతూ రోజులూ, వారాలు గడుపుతున్నారు.

ఎన్నారయ్య మరో కుక్కపిల్లని తెస్తానన్నాడు కాని సింబాబు ఒప్పుకోలేదు. అదెప్పటికీ హంటరవదు పొమ్మన్నాడు.

నిదానంమీద సినిమాలకీ, షికార్లకీ తిప్పి, నింటెండోలూ గట్రా కొనిపెట్టీ ఆ పిల్లాడిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నారు కుటుంబంలో అందరూ.

కొడుకు కొత్తగా విడుదలయిన సీడీలు కావాలంటే తండ్రీ కొడుకూ మ్యూజిక్ స్టోర్‌లో జొరబడ్డారు. సూసన్ తల్లితో మార్షల్‌ఫీల్డ్‌వేపు దారి తీసింది స్ప్రింగ్ డిజైన్లు చూడ్డానికి.

షాపులో అడుగెట్టగానే ఆ అమ్మాయి కళ్లబడింది ఎదురుగా రాక్‌మీద వేలాడేసిన షాల్. "మామ్" అంటూ తల్లిని కేకేసింది. ఆది అచ్చు ఇండియాలో తాము కొన్నలాటిదే. అక్కడ షాపువాడు ఆరొందలయాభై రూపాయలు చెప్తే, నాలుగొందల ఇరవై రూపాయలకి సెటిల్ చేసుకు తృప్తి పడ్డారు. అదే షాల్ ఇక్కడ నూట యాభై డాలర్లు!

అంటే ఎన్ని రూపాయలో? దీన్ని "హైవే రాబరీ" అని ఎందుకనరో?

ఆ తరవాత సినిమాచూసి, చైనీస్ రెస్టారెంట్‌లో భోంచేసి ఇంటికొచ్చేరు.

దాదాపు 250 డాలర్లు ఖర్చయిందాపూట.

"అంటే ఎన్ని రూపాయలు?" అనడిగింది సూ.

"అదేం ప్రశ్న?" అన్నాడు తండ్రి.

"మనం ఇక్కడ డాలర్లలో సంపాదిస్తాం. డాలర్లలో ఖర్చు పెడతాం" అంది తల్లి విశ్వరహస్యం వివరిస్తున్నట్టు.
"యూ డమ్మీ!" అన్నాడు సీంబాబు.
తనప్రశ్నలో అంతరార్థం వారెవరికీ అర్థం అవలేదన్న సంగతి ఆపిల్లకి మాత్రమే అర్థం అయింది!

*****************
*****

From:
Malathi Rao
7207 Old Sauk Road
Madison, WI 53717
USA

email: mrao@edgewood.edu